

నవాబుపేట మండలంలో మోస్తరు వర్షం



నవాబుపేట, జూలై 19 : నవాబుపేటమండల కేంద్రంతో పాటు చంచల్‌పేట్, దత్తాపూర్, అక్నాపూర్ తదితర గ్రామాల్లో శుక్రవారం మోస్తరు వర్షం కురిసింది. వానాకాలం సాగుకు సరిపడా వర్షాలు కురియకపోవడంతో రైతులు వరుణుడి కోసం ఎదురు చూస్తున్న క్రమంలో కురిసిన మోస్తరు వర్షంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు.



అక్రమ తవ్వకాలను పరిశీలిస్తున్న మైన్స్ అధికారులు

అక్రమ మైనింగ్‌పై కొరడా

● కలెక్టర్ ఆదేశాలతో కదిలిన అధికార యంత్రాగం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


తాండూరు రూరల్, జూలై 19: 'సంగెం కలాన్‌లో అక్రమ మైనింగ్ అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి మైనింగ్ అధికారులు స్పందించారు. మైన్స్‌శాఖ ఏడీతో పాటు సిబ్బంది క్షేత్రస్థాయిలో శుక్రవారం పర్యటించారు. సంగెం కలాన్ గ్రామశివారులో అక్రమంగా తవ్వుతున్న నాపరాతి గనులను పరిశీలించారు. మైనింగ్ ఏడీ సత్యనారాయణ మాట్లాడుతూ మైనింగ్ అనుమతి లేకుండా అక్రమంగా కొనసాగుతున్న తవ్వకాలను నిలిపివేశామన్నారు. అదేవిధంగా సంగెం కలాన్ గ్రామ శివారులోని పట్టాభూమి సర్వేనంబర్ 110లో అక్రమమైనింగ్ తవ్వకాలు జరుపుతున్నారని, క్షేత్రస్థాయిలో నాపరాతి గనులను పరిశీలించామని చెప్పారు. పట్టాభూమిలో మైనింగ్ లీజ్ లేకుండా కొనసాగడంతో యజమాని వివరాలను సేకరించామని పేర్కొన్నారు. గనిలోనాపరాతి బండలతండాలో ఉన్న రెండు లారీలను జప్తు చేశామని, కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించామన్నారు. గనిలో ఇప్పటి వరకు తవ్వకాలు జరిపిన సంబంధిత యజమానిపై మైనింగ్ చట్టప్రకారం భారీ జరిమానా విధిస్తామని వెల్లడించారు. ఎవరైనా మైనింగ్‌శాఖ నుంచి అనుమతులు లేకుండా తవ్వకాలు జరిపితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట మైన్స్ ఏజీ నాగరాజ్, ఆర్ఐ నిర్మల, సిబ్బంది ఉన్నారు.

చేప పిల్లల పంపిణీకి గ్రీన్ సిగ్నల్

- టెండర్ల ప్రక్రియ ప్రారంభం
- మత్స్యకారుల్లో చిగురిస్తున్న ఆశలు



మేడ్చల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల జీవనోపాధికి ఎప్పటి మాదిరిగానే వంద శాతం రాయితీపై చేప పిల్లల పంపిణీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనితో మత్స్యకారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ప్రతి ఏటా ఏప్రిల్, మే నెలల్లోనే టెండర్ల ప్రక్రియ పూర్తయ్యేది. జూలై నుంచి సెప్టెంబరు వరకు చెరువులు, కుంటల్లో నీటి నిల్వ సామార్థ్యాన్ని బట్టి చేప పిల్లలను వదులుతారు. అసెంబ్లీఎన్నికల తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఈ పథకం కొనసాగింపుపై స్పష్టత రాలేదు. దీంతో మత్స్యకారుల్లో సందిగ్ధం నెలకొంది. రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ ఇటీవల చేపపిల్లల సరఫరాకు టెండర్లను ఆహ్వానించారు. ఈనెల 23తో ప్రక్రియ పూర్తవుతుంది. చెరువులు, కుంటల్లోనీటి లభ్యతను బట్టి పంపిణీ చేస్తారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 82 మత్స్యపారిశ్రామిక సహకార సంఘాలున్నాయి. వాటిలో 3,738 మంది సభ్యులున్నారు. 2023-24లో 68.5 లక్షల చేప పిల్లలు పంపిణీ జరిగింది. జిల్లాలో చేప పిల్లలను సరఫరా చేసే కాంట్రాక్టర్లు లేకపోవడంతో ఏపీకి చెందిన కాంట్రాక్టర్లు ఏటా టెండర్లలో అవకాశం దక్కించుకుంటున్నారు. అయితే వీటిని ఆయా సంఘాలకు పంపిణీ చేయడంలో వ్యత్యాసం ఉంటుంది. దీనిపై గతంలో చాలా సార్లు ఫిర్యాదులు సైతం వెళ్లాయి. నిర్ధేశించిన లక్ష్యానికి సరిపడా లేక తక్కువ సంఖ్యలో ఇస్తుండటంతో మత్స్యకారులు ఆందోళనకు దిగిన సంఘటనలూ ఉన్నాయి. ఈసారైనా అధికారులు పక్కాగా చర్యలు చేపట్టి నాణ్యమైన చేప పిల్లల విత్తనం పంపిణీ చేయాలని మత్స్యకారులు కోరుతున్నారు. ప్రస్తుతం చెరువులు, కుంటల్లో ప్రస్తుతం నీటి లభ్యత అంతంత మాత్రంగానే ఉంది. సగానికి పైగా నీరుంటేనే పంపిణీకి అవకాశం ఉంటుంది.



దామగుండం అటవీ ప్రాంతం

తెలంగాణ రాష్ట్రంలో నేవీ రాడార్ స్టేషన్ నిర్మాణ పనులకు ముహూర్తం ఖరారైంది. రక్షణ పరంగా తెలంగాణను కీలక స్థావరంగా ఎంచుకున్న భారత నావికాదళం దేశంలోనే రెండో వీఎల్ఎఫ్ కమ్యూనికేషన్ స్టేషన్‌ను దామగుండం అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడి నుంచి అంతర్జాతీయ స్థాయిలో నేవీ వ్యవస్థను సిగ్నల్స్ ద్వారా మానిటరింగ్ చేయనున్నారు. నౌకలు, జంతర్గాముల సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అవసరమైన సమాచారాన్ని చేరవేసేందుకు నావికాదళం వీఎల్ఎఫ్ కమ్యూనికేషన్ ట్రాన్స్‌మిషన్ స్టేషన్‌ను వినియోగించుకోనుంది.

దామగుండంలో నేవీ రాడార్!

ప్రాజెక్టు నిర్మాణానికి ముహూర్తం ఖరారు

రూ.2,500 కోట్లతో వీఎల్ఎఫ్ స్టేషన్ నిర్మాణం

2027 నాటికి అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యం

- వీఎల్ఎఫ్ కమ్యూనికేషన్ ట్రాన్స్‌మిషన్ స్టేషన్ ఏర్పాటు
- 28న నిర్మాణానికి శంకుస్థాపన
- కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర, రాష్ట్ర మంత్రుల రాక
- దామగుండం అటవీ ప్రాంతంలో 2,935 ఎకరాలు నేవీకి అప్పగింత
- రాష్ట్ర ప్రభుత్వం చొరవతో 14ఏళ్ల పెండింగ్ ప్రాజెక్టుకు మోక్షం



రాడార్ ప్రాజెక్టు శంకుస్థాపన చేయనున్న స్థలంలో ఎమ్మెల్యే, కలెక్టర్,ఎస్పీలతో చర్చిస్తున్న నేవీ అధికారులు

వికారాబాద్, జూలై19 (ఆంధ్రజ్యోతి)/ పరిగి : భారత నావికాదళం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న నేవీ రాడార్ స్టేషన్ (వీఎల్ఎఫ్- వెరీ లో ఫ్రీక్వెన్సీ కమ్యూనికేషన్ స్టేషన్) వికారాబాద్ జిల్లా, పూడూరు మండలం, దామగుండం అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. నౌకలు, జంతర్గాముల సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ... అవసరమైన సమాచారాన్ని చేరవేసేందుకు నావికాదళం వీఎల్ఎఫ్ కమ్యూనికేషన్ ట్రాన్స్‌మిషన్ స్టేషన్‌ను వినియోగించుకోనుంది. నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటుకు దామగుండం అత్యంత అనువైన ప్రాంతంగా విశాఖపట్నంలోని తూర్పు నౌకాదళ కమాండ్ గుర్తించింది. దామగుండం అటవీ ప్రాంతంలో నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటు చేసేందుకు నావికాదళం 2010 నుంచి 2023 వరకు అప్పటి రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదింపులు నిర్వహిస్తూ వచ్చినా ఫలితం లేకపోయింది. రాడార్ స్టేషన్ ఏర్పాటు చేసేందుకు పర్యావరణం, అటవీ, దేవాదాయ, కాలుష్య నియంత్రణబోర్డు, రెవెన్యూ, పంచాయతీరాజ్ తదితర 16 రకాల అనుమతులతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా క్లియరెన్స్ ఇవ్వాల్సి ఉండగా, భారత నావికాదళం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోకి వచ్చే 15రకాల అనుమతులు వచ్చినా ఈ ప్రాజెక్టుకు సంబంధించి దామగుండం రిజర్వు ఫారెస్ట్ భూముల అప్పగింత గత ఏడాది డిసెంబరు వరకు పెండింగ్‌లో ఉన్న విషయం విదితమే.

పుంజుకున్న వేగం

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటు ప్రక్రియ వేగం పుంజుకుంది. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటుకు అడ్డంకులన్నీ తొలగిపోయాయి. గత జనవరి నెలలో 2935 ఎకరాల దామగుండం అటవీ భూములను నేవీకి బదిలీ చేశారు. అంతకు ముందే అటవీ భూమిని అప్పగించేందుకు రూ.133.54 కోట్ల కంపా నిధులు, భూసంరక్షణ పనులు చేపట్టేందుకు రూ.18.56 కోట్లు నేవీ చెల్లించింది. నేవీ రాడార్ స్టేషన్‌కు గత ఫిబ్రవరి నెలలోనే శంకుస్థాపన జరగాల్సి ఉండగా, లోక్‌సభ ఎన్నికల కారణంగా వాయిదా పడింది. 14 ఏళ్లుగా పెండింగ్‌లో ఈ ప్రాజెక్టు ఎట్టకేలకు త్వరలో సాకారం కాబోతోంది. ఎట్టకేలకు దామగుండం నేవీ రాడార్ స్టేషన్ నిర్మాణానికి ముహూర్తం ఖరారైనట్లు తెలిసింది. ఈనెల 28వ తేదీన కేంద్ర రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, సీఎం రేవంత్‌రెడ్డిల చేతుల మీదుగా నిర్వహించే శంకుస్థాపన కార్యక్రమానికి పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు హాజరు కానున్నట్లు సమాచారం. ఈ పర్యటనను అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

3000 మంది నివసించేలా టౌన్‌షిప్ ఏర్పాటు

దామగుండంలో నేవీ రాడార్ స్టేషన్‌కు 2935 ఎకరాల అటవీ భూములను అప్పగించినా ఆ భూముల్లో 1500 ఎకరాల్లో ఎలాంటి కార్యకలాపాలు చేపట్టరు. అక్కడ ఉండే చెట్లకు నష్టం కలిగించే పనులు చేయకుండా చర్యలు తీసుకుంటారు. ఎక్కడైనా చెట్లకు నష్టం కలిగే పరిస్థితులు ఉంటే అటవీ శాఖ అనుమతులు తీసుకున్న తరువాతనే వాటిని తొలగిస్తారు. జీవ వైవిధ్యం, పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు వీలుగా విస్తృతంగా మొక్కలు నాటనున్నారు. దామగుండం రిజర్వు ఫారెస్ట్ చుట్టూ 27 కిలోమీటర్ల పొడవు రోడ్డు నిర్మించనున్నారు. సుమారు 3 వేల మంది వరకు నివాసం ఉండేలా టౌన్‌షిప్ నిర్మాణం చేపడతారు.

పర్యావరణానికి ఇబ్బంది కలగకుండా..

2027 నాటికి దామగుండం నేవీ రాడార్ స్టేషన్‌ను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకు రావాలనే లక్ష్యంతో నావికాదళం కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకుంది. రాడార్ స్టేషన్‌లో 600 మంది వరకు నావికాదళం అధికారులు, సిబ్బంది వరకు విధులు నిర్వహిస్తారు. నావికాదళం సిబ్బందితో పాటు ఇతర సాధారణ పౌరులు కూడా ఉండనున్నారు. రాడార్ స్టేషన్‌కు కేటాయించిన ప్రాంతంలో పర్యావరణానికి ఇబ్బంది కలకుండా మొక్కలు, చెట్లు లేని ప్రాంతంలో 350 ఎకరాల్లో టౌన్‌షిప్ నిర్మాణం చేపట్టనున్నారు.

దేశంలో 2వ వీఎల్ఎఫ్ స్టేషన్

పూడూరులో ఏర్పాటు చేయనున్న నేవీ రాడార్ స్టేషన్ దేశంలోనే రెండోది. పూడూరు భూములు ఎత్తైన ప్రదేశంలో ఉండడంతో రాడార్ ద్వారా సముద్రమార్గాన్ని వీక్షించడానికి అనువు గా ఉంటుందని.. అంతే కాకుండా. రాడార్ వ్యవస్థ శత్రు దుర్భేద్యంగా ఉండడానికి దామగుండం అటవీ ప్రాంతం అత్యంత అనువైన స్థలంగా ఎంచుకున్నారు. దామగుండం అటవీ ప్రాంతం సముద్ర మట్టానికి 360 అడుగుల ఎత్తున ఉండడం, హైదరాబాద్‌కు 60 కి.మీ దూరం ఉండడం వల్ల వీఎల్ఎఫ్ కమ్యూనికేషన్ స్టేషన్ ఏర్పాటు చేసేందుకు ఇదే అనువైన ప్రాంతంగా భారత నావికాదళం ఎంపిక చేసుకుంది. ఇక్కడి నుంచి అంతర్జాతీయ స్థాయిలో నేవీ వ్యవస్థను సిగ్నల్స్ ద్వారా మానిటరింగ్ చేయనున్నారు. రూ.2500 కోట్లతో ఏర్పాటు చేయనున్న నేవీ రాడార్ స్టేషన్‌ను 2027 నాటికి అందుబాటులోకి తీసుకు రావాలని కేంద్ర రక్షణ శాఖ భావిస్తోంది. నేవీ రాడార్ ప్రాజెక్టు ఏర్పాటుతో వికారాబాద్ జిల్లా దామగుండం ప్రాంతానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించనుంది.



ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువు బఫర్‌జోన్‌లో వేసిన మట్టి, రాళ్లు



ఎఫ్‌టీఎల్ హద్దు రాయి

బఫర్ కబ్జా!

- మట్టి, రాళ్లతో నింపేస్తున్న అక్రమార్కులు
- కబ్జాకు యత్నిస్తున్న భూ బకాసూరులు
- రోజురోజుకు తగ్గుతున్న చెరువులు, కుంటల విస్తీర్ణం
- ఉనికి కోల్పోతున్న సాగునీటి కాలువలు
- కన్నెత్తి చూడని ఇరిగేషన్ అధికారులు

ఘట్‌కేసర్ రూరల్, జూలై 19 : చెరువులు, కుంటల పరిరక్షణ కోసం ప్రభుత్వం ఒకవైపు కొత్త చట్టాలు తీసుకొస్తుండగా, మరోవైపు భూ బకాసూరులు ప్రభుత్వ భూములనూ వదడలం లేదు. రాత్రికి రాత్రే నిబంధనలను అతిక్రమించి కబ్జాలకు తెగబడుతున్నారు. చెరువులు, కుంటలు, సాగునీటి కాలువలు కాపాడి వాటి అభివృద్ధి కృషి చేయాలని ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లను దర్జాగా కబ్జా చేస్తున్నారు. చెరువులు, కుంటలను ఆక్రమించి మట్టితో నింపి వాటి ఉనికి లేకుండా చేస్తున్నారు. సాగునీటి కాలువల్లో నీరు రానివ్వకుండా వాటి ఉనికిని దెబ్బతీస్తున్నారు. ఘట్‌కేసర్ మండల పరిధి ఎదులాబాద్ లక్ష్మినారాయణ చెరువు దాదాపు 650ఎకరాల విస్తీర్ణంలో ఉంది. రెండు వేల ఏకరాల్లో రైతులు వ్యవసాయం చేస్తున్నారు. ఇది దృష్టిలో పెట్టుకొని ఇరిగేషన్ అధికారులు గతంలోనే ఈ చెరువుకు ఎఫ్‌టీఎల్ (ఫుల్ లెవల్ ట్యాంక్) హద్దురాళ్లను ఏర్పాటు చేశారు. కానీ కొందరు అక్రమార్కులు చెరువు పక్కన భూములను కొనుగోలు చేసి బఫర్ జోన్‌లో మట్టితో నింపి చదును చేస్తూ కబ్జాకు యత్నిస్తున్నారు. నిబంధనలు అతిక్రమించి ఎఫ్‌టీఎల్‌ను సైతం కబ్జా చేస్తున్నారు. మర్రి పల్లిగూడ రెవెన్యూ పరిధి సర్వేనెంబర్ 55కు లక్ష్మీనారాయణ చెరువు ఆనుకొని ఉంటుంది. చెరువు ఎఫ్‌టీఎల్ నుంచి 30 మీటర్ల వరకూ బఫర్ జోన్ వదిలి పెట్టాలనే నిబంధనలు ఉన్నాయి. కానీ సదరు పట్టదారు మాత్రం ఏకంగా బఫర్‌జోన్‌లో మట్టి, రాళ్లతో నింపేస్తున్నారు. రాత్రికిరాత్రే మట్టి, రాళ్లు వేసి అక్రమిస్తున్నారు. దీంతో ఎగువభాగం నుంచి రావాల్సిన వర్షపునీరు రాకుండా పోయింది. చెరువు ఉనికికే ప్రమాదం వాటిల్లుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రియల్ వ్యాపారులు చెరువు బఫర్‌జోన్‌ను ఆక్రమించి వెంచర్లు చేస్తున్నారు. దీంతో చెరువు కుచించుకుపోయే ప్రమాదం ఉంది. ఇంత జరుగుతున్నా ఇరిగేషన్ అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడటం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు సకాలంలో స్పందించి చెరువులు, కుంటలు, సాగునీటి కాలువల బఫర్‌జోన్లను కాపాడాలని కోరుతున్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పరిశీలన

వికారాబాద్, జూలై 19 : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులను కలెక్టర్ తనిఖీ చేశారు. శుక్రవారం వికారాబాద్ మండల పరిధిలోని గోధుమగూడ, జైదుపల్లి గ్రామ పంచాయతీల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులను పరిశీలించి అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. పనులు త్వరతగిన పూర్తి చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మంచి భోజనం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ ఉమా హారతి, ఎంపీడీవో వినయ్‌కుమార్, ఎంపీవో నాగరాజు, ఎంఈవో బాబుసింగ్, ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు , సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్



తాండూరు-వికారాబాద్ రోడ్డుకు మహర్దశ

- రూ. 100 కోట్లతో పనులు
- మెరుగు పడనున్న రవాణా వ్యవస్థ

తాండూరు, జూలై 19: తాండూరు - వికారాబాద్ రోడ్డు డబుల్‌లైన్ రోడ్డుగా మారనుంది. ఇందుకు గాను రూ. 100కోట్లతో పనులు చేపట్టానున్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి సంబంధించి చేసిన రివైజ్డ్ ఎస్టిమెంట్ తయారు చేశారు. కాగా తాండూరు - వికారాబాద్ డబుల్‌రోడ్డు నిర్మాణానికి ఇప్పటికే రూ. 50 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. మరో రూ. 50కోట్లు కేటాయించేందుకు ప్రతిపాదనలు చేశారు. దీంతో వంద కోట్లతో ఈ రోడ్డు పనులు చేపట్టనున్నారు. ప్రస్తుం మిగతా నిధులకు సంబంధించిన ప్రాతిపదనలు ఆర్అండ్‌బి చీఫ్ ఇంజనీర్ నుంచి ఆర్థిక శాఖ అనుమతి కోసం వెళ్లింది. రెండు మూడు రోజుల్లో అనుమతులు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈ మార్గంలో ప్రతి రోజు మూడు వేలకుపైగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో ఈ రోడ్డు తరుచు గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. అధిక లోడ్‌తో నాపరాళ్లు , సుద్ద, సిమెంట్ వాహనాలు వెళ్తుండటంతో రోడ్డు గుంతలమయమౌతుంది. వానాకాలంలో ఇబ్బందులు రాకుండా ఉండేలా స్వయంగా స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవడంతో పనులకు మోక్షం కలగనుంది. అయితే ఈ నెల 27న రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రెవెన్యూ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఈ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసేందుకు తేదీ ఖరారు చేశారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న కోటిరెడ్డి

శామీర్‌పేట్ పీఎస్‌ను సందర్శించిన డీసీపీ

మూడుచింతలపల్లి, జూలై 19: శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌ను డీసీపీ కోటిరెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఐలు, సిబ్బందితో సమావేశమై నేరాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అదే విధంగా దర్యాప్తు వేగంగా జరిగేందుకు చర్యలు తీసుకోవాలని సీసీ కెమెరాల ప్రాధాన్యతను వివరించారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పేట్‌బషీరాబాద్ ఏసీపీ రాములు, సీఐ శ్రీనాథ్, ఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జడ్పీహెచ్ఎస్‌కు డ్యూయల్ డెస్క్‌లు


బషీరాబాద్ పాఠశాలకు చేరుకున్న డ్యూయల్‌డెస్క్ బెంచీలు

బషీరాబాద్, జూలై 19: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల (బాలికలు)కు డ్యూయల్ డెస్క్ బెంచీలు చేరుకున్నాయి. మనఊరు- మనబడి పథకం కింద 150డ్యూయల్ డెస్క్‌లు పాఠశాలకు చేరినట్లు జీహెచ్ఎం హీర్యానాయక్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి అధునాతనమైన బెంచీలు రావడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే రాష్ట్ర అభివృద్ధి

ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

తాండూరు, జూలై 19: జాతీయవాదం, రాజకీయాలకు అతీతంగా ప్రధాని మోదీ ఆర్థికంగా తెలంగాణకు సహకరించడంతోనే అభివృద్ధి సాధ్యమవుతోందని చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. తాండూరు పట్టణం తులసీ గార్డెన్‌లో శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌర సన్మాన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వ సహకారం లేకుంటే రాష్ట్ర సర్కార్ ఎప్పుడో కూలిపోయేదని అన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ఖజానా ఖాళీగా ఉందని అన్నారు. రూ.లక్షా 35వేల కోట్ల ఆదాయానికిగాను రూ.50వేల కోట్లు వేతనాలకే సరిపోతున్నదని తెలిపారు. గత కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పులను రూ.80వేల కోట్లు చెల్లించాల్సి వస్తుందని అన్నారు. పింఛన్లు, ఆరు గ్యారంటీల అమలు, ఇతర సంక్షేమ పథకాలు అమలు చేయలేని పరిస్థితిలో ఉండగా కేంద్ర ప్రభుత్వం జనవరి మాసంలో రూ.9వేల కోట్లు, ఫిబ్రవరి రూ.3వేల కోట్లు, మార్చిలో రూ.4వేల కోట్లను రాష్ట్రానికి అందించిందని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో చేవెళ్ల పార్లమెంటు పరిధిలో 7వేల మంది వార్డు సభ్యులు, 800 మంది సర్పంచ్‌లు బీజేపీ అభ్యర్థులు గెలవాలని లక్ష్యంగా పెట్టుకొని పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలోఓ రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు యు.రమేష్, బీజేపీ తాండూరు నియోజకవర్గ ఇన్‌చార్జి రజనీకాంత్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, బీజేపీ సీనియర్ నాయకులు నరేష్ మహరాజ్, గాజుల శాంత్‌కుమార్, బాలి శివకుమార్, మాజీ ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా పాల్గొన్నారు. అనంతరం కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని కార్యకర్తలు ఘనంగా సన్మానించారు.


తాండూరులో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

శ్రీ విద్యావిహార్ స్కూల్‌పై విచారణ జరపాలి

జాతీయ బాలల హక్కుల కమిషన్ ఆదేశం

ఘట్‌కేసర్, జూలై 19: పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడలో గల శ్రీవిద్యావిహార్ స్కూల్ యాజమాన్యం బాలల హక్కులను హరిస్తున్నదని విద్యార్థుల తల్లిదండ్రులు జాతీయ బాలల హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు స్పందించిన కమిషన్ శ్రీవిద్యావిహార్ పాఠశాలలో నిబంధనల ఉల్లంఘనలపై వచ్చిన ఫిర్యాదుపై విచారణ జరిపి వారం రోజుల్లో నివేదిక అందజేయాలని మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టర్‌కు కమిషన్ సూచించింది. కాగా శ్రీవిద్యావిహార్ స్కూల్ యాజమాన్యం అధిక ఫీజులు వసులు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని, అదేమని అడిగితే విద్యార్థులకు టీసీలు ఇచ్చి ఇంటికి పంపిస్తున్నారని తెలిపారు. గతంలో విద్యార్థుల తల్లిదండ్రులు జిల్లా విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేసిన సందర్భాలున్నాయి.

శనీశ్వర ఆలయంలో టెంకాయల వేలం

మోమిన్‌పేట్, జూలై 19: ఎన్కతలలోని శనీశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం టెంకాయల విక్రయానికి వేలం నిర్వహించారు. ఈ వేలంలో రూ.2లక్షల 65వేలకు గ్రామానికి చెందిన బోయ శ్రీనివాస్ దక్కించుకున్నాడు. ఆలయ కమిటీ మేనేజర్ నరేందర్ పాల్గొన్నారు.

రేపు గురుపౌర్ణమి వేడుకలు

వికారాబాద్, జూలై 19: ఈ నెల 21న భగవాన్ శ్రీ సత్యసాయి జ్ఞాన కేంద్రంలో గురు పౌర్ణమి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు సత్యసాయిజ్ఞాన కేంద్రం కన్వీనర్ సత్యనారాయణ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు కార్యక్రమాలు ఉంటాయన్నారు.

సహకార బ్యాంకు నిర్మాణానికి భూమి పూజ

మోమిన్‌పేట్, జూలై 19: మండల కేంద్రంలో కొన్ని సంవత్సరాలుగా సొంత భవనానికి నోచుకోని సహకార బ్యాంకు నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సంతోషించదగ్గ విషయమని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్ కె.సత్తయ్య యాదవ్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో శుక్రవారం రూ.63 లక్షల నిధులతో నూతన భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. మండల కేంద్రానికి సెంటర్ పాయింట్ ఉండటంతో అన్ని మండలాలకు అనుసంధానంగా ఉండేందుకు నూతన భవన నిర్మాణంతో సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్‌చైర్మన్ భైండ్ల విజయ్‌కుమార్, తహసీల్దార్ మనోహరచక్రవర్తి, సీఈవో భాస్కర సుబ్రహ్మణ్యం, డీసీసీబీ డైరెక్టర్లు పట్లోళ్ల అంజిరెడ్డి, రాంచంద్రారెడ్డి, రామ్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, బి.విష్ణువర్దన్‌రెడ్డి, కో ఆపరేటివ్ బ్యాంకు మేనేజర్ నారాయణరెడ్డి, సత్యనారాయణ, విఠల్‌రెడ్డి, అనంతయ్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజు, సర్వేయర్ రాందాస్, రెవెన్యూ సిబ్బంది, సహకార సంఘం బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.


సహకార బ్యాంకు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న డీసీసీ చైర్మన్ సత్తయ్యయాదవ్

అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పరిశీలన

ధారూరు, జూలై 19: మండలంలోని రాంపూర్, అవుసుపల్లి, కొండాపూర్‌కలాన్, నర్సాపూర్ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల పనుల ప్రగతిని అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి శుక్రవారం పరిశీలించారు. ఈ పాఠశాలలో జరిగిన పనులను ఆమె తనిఖీ చేశారు. అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను ఆదేశించారు.


అధికారులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి



షాద్‌నగర్ డిపో ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

బస్సులు ఆపడం లేదని విద్యార్థుల ఆందోళన

కేశంపేట, జూలై 19: మండలంలో ఆర్టీసీ బస్సులు ఆపడం లేదని విద్యార్థులు శుక్రవారం షాద్‌నగర్ ఆర్టీసీ డిపో ఎదుట ఆందోళనకు దిగారు. మండలంలోని లేమామిడి, కేశంపేట, వేముల్‌నర్వ, ఇప్పలపల్లి, పాపిరెడ్డిగూడ గ్రామాల నుంచి ఉన్నత విద్య కొరకు విద్యార్థులు నిత్యం షాద్‌నగర్‌కు వెళ్తుంటారు. అయితే ఆయా గ్రామాల మీదుగా వెళ్తున్న ఆర్టీసీ బస్సులు ఉదయం వేళల్లో ఆపడం లేదంటూ ఆందోళనకు దిగారు. బస్సులు ఆపకపోవడంతో కాలేజీలకు సమయానికి వెళ్లలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం విద్యార్థులకు ప్రత్యేక బస్సులు నడపాలని డిమాండ్ చేశారు. అయితే, ఈ విషయం ఆర్టీసీ ఉన్నతాధికారులకు చెబుతామని రూట్ డ్రైవర్లు విద్యార్థులకు చెప్పి పంపించారు. కేశంపేట మండలంలో అన్ని గ్రామాల్లో ఉదయం పూట బస్సులు ఆపేలా డీఎం చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

ఎమ్మెల్యే ప్రారంభించిన రెండు రోజులకే..

నిలిచిపోయిన బస్ సేవలు

కులకచర్ల, జూలై 19: పరిగి నుంచి వయా ముజాహిద్‌పూర్, చౌడాపూర్ మీదుగా పాలమూర్‌కు ప్రారంభించిన ఆర్టీసీ బస్ ప్రారంభించిన రెండు రోజులకే నిలిచిపోయింది. గత నెలలో పరిగి డిపోకు కొత్త బస్సులు వచ్చాయి. కొత్తగా మండలం ఏర్పడిన చౌడాపూర్ మండలంలోని ఆయా గ్రామ ప్రజలకు బస్సు సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి నెలరోజుల క్రితం పరిగి నుంచి వయా ముజాహిద్‌పూర్, కులకచర్ల, చౌడాపూర్, మరికల్, నవాబుపేట మీదుగా పాలమూర్‌కు బస్‌ను ప్రారంభించారు. ఆ తర్వాత రెండు రోజులకే బస్ సేవలు నిలిచిపోయాయి. తమ గ్రామాలకు బస్ సౌకర్యం ఎంతో సంతోషడిన ఆయా గ్రామాల ప్రజలకు నిరాశే మిగిలింది. చౌడాపూర్ మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం, పోలీస్‌స్టేషన్ లేదు. ఇందుకు మండల ప్రజలు కులకచర్లకు రావాల్సిందే. ప్రారంభించిన బస్సు నిలిచి పోవడంతో ఆటో, ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి వస్తున్నారు. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి చొరవ తీసుకొని నిలిచిపోయిన చౌడాపూర్, మరికల్ మీదుగా పాలమూర్ బస్సును కొనసాగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అరుణాచలం యాత్రకు ఆర్టీసీ బస్సు

- ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



అరుణాచలం బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి

షాద్‌నగర్ అర్బన్, జూలై 19: తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచలం దైవ దర్శనానికి ఏర్పాటుచేసిన ఆర్టీసీ బస్సును ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ట్రయల్ రన్‌గా షాద్‌నగర్ డిపో నుంచి శుక్రవారం పంపిన బస్సును వర్షంలోనే ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రతీ ప్రయాణికుడు వెళ్లి రావడానికి 3,600 రూపాయల టికెట్టును తీసుకున్నారు. శనివారం ఉదయం కాణిపాకం, అటు నుంచి గోల్డెన్ టెంపుల్‌కు వెళ్లి, అనంతరం అరుణాచలం వెళ్తుందని డిపో మేనేజర్ తెలిపారు. అరుణాచలంలో ఆదివారం గిరి ప్రదక్షణ చేయించుకుని సోమవారం ఉదయం తిరిగి షాద్‌నగర్‌కు బస్సు చేరుకుంటుందని తెలిపారు. భక్తుల డిమాండ్‌ను బట్టి అరుణాచలం బస్సులను నడిపిస్తామని డీఎం తెలిపారు.



రైతులకు చెక్కులు అందచేస్తున్న సత్యనారాయణ

'హెరిటేజ్' పాడి రైతులకు రూ.2లక్షల ప్రమాద బీమా సదుపాయం

కడ్తాల్, జూలై 19: హెరిటేజ్ డెయిరీ పాడి రైతులకు రూ.2లక్షల ప్రమాద బీమా సదుపాయం కల్పిస్తున్నట్లు జోనల్ ఇన్‌చార్జి సత్యనారాయణ తెలిపారు. రైతులు వ్యవసాయానికి అనుబంధంగా పాడి పరిశ్రమతో లాభాలు గడించి ఆర్థికంగా వృద్ధి చెందాలని ఆయన కోరారు. కడ్తాల్ మండలం రావిచెడ్‌లో శుక్రవారం హెరిటేజ్ డెయిరీ ఆధ్వర్యంలో పాడి రైతులకు అవగాహన సదస్సు, రుణాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఒక్కొక్క రైతుకు రూ.50 వేల చొప్పున వంద మందికి రుణాలు అందించారు. అనంతరం జరిగిన సమావేశంలో సత్యనారాయణ మాట్లాడుతూ పాడి పరిశ్రమ ద్వారా మంచి ఆదాయం పొందవచ్చునని చెప్పారు. హెరిటేజ్ డెయిరీ ద్వారా దాణా, పశువులకు ఇన్సూరెన్సు, రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏరియా మేనేజర్ వెంకటేశం, ప్లాంట్ మేనేజర్ నరేష్, సూపర్ వైజర్ శివ, డాక్టర్ ప్రభాకర్, ఏజెంట్ శ్రీశైలం, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఓబీసీ మోర్చా కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జిగా శ్రీశైలం



ఇబ్రహీంపట్నం, జూలై 19: బీజేపీ ఓబీసీ మోర్చా కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జిగా నిట్టు శ్రీశైలంను నియమిస్తూ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇబ్రహీంపట్నం మండలం దండుమైలారం గ్రామానికి చెందిన శ్రీశైలం బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఉన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కి అత్యంత సన్నిహితుడిగా ఉన్న శ్రీశైలం పార్టీలో చురుగ్గా పనిచేస్తున్నారు. తనకు ఈ బాధ్యతలు అప్పగించినందుకు కరీంనగర్ జిల్లాలో ఓబీసీలను ఏకంచేసి బీజేపీ అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

కొత్త నేర చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

పరిగి, జూలై 19: కొత్త క్రిమినల్ చట్టాలపై ప్రతీఒక్కరు తెలుసుకోవాల్సిన అవసరముందని వికారాబాద్ కోర్టు సీనియర్ న్యాయవాది ఎం.గోపాల్‌రెడ్డి అన్నారు. న్యాయవాద పరిషత్ జిల్లా అధ్యక్షుడు జి.కృష్ణారెడ్డి అధ్యక్షతన శుక్రవారం పరిగి బార్ అసోసియేషన్ కార్యాలయంలో నూతన నేరచట్టాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త చట్టాల అమలులో కొంత ఇబ్బందికరంగా ఉంటుందని అన్నారు. ఈ విషయాన్ని ప్రతి న్యాయవాది, ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరముందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాద పరిషత్ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, రాష్ట్ర నాయకులు యాదవరెడ్డి, సీనియర్ న్యాయవాది ఆనంద్‌గౌడ్, ఎస్‌ఐ సంతోష్‌లు చట్టాల గురించి వివరించారు. న్యాయవాదులు లింగం, బి.వెంకట్‌రెడ్డి, నరేంద్రయాదవ్, దయాకర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, గౌస్ పాష శ్రీశైలం, జయలక్ష్మి పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక పనులు చేయొద్దు

వికారాబాద్, జూలై 19: చట్ట వ్యతిరేక పనులు చేయవద్దని వికారాబాద్ సీఐ నాగరాజు తెలిపారు. పట్టణంలోని రౌడీషీటర్ల నివాసాలకు, వారు పని చేసే ప్రాంతాలను శుక్రవారం సందర్శించి వారితో మాట్లాడారు. ఎవరూ కూడా చట్ట వ్యతిరేక పనులు చేయరాదని రౌడీ షీటర్స్ సస్పెక్ట్‌పైన ఎల్లప్పుడు నిఘా ఉంటుందన్నారు. చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలలో పాల్గొన్నట్లు తెలిస్తే కఠినచర్యలుంటాయని హెచ్చరించారు.

గంజాయికి అలవాటు పడి..

పెడ్లర్‌గా మారి!

- గంజాయి సరఫరా చేస్తున్న బీటెక్ విద్యార్థి
- మరో ఐదుగురితో కలిసి గంజాయి సేవిస్తుండగా నార్కోటిక్ దాడుల్లో పట్టుబడిన వైనం
- 150 గ్రాముల గంజాయి స్వాధీనం.. కేసు నమోదు

ఇబ్రహీంపట్నం, జూలై 19 : గంజాయికి అలవాటుపడిన ఓ బీటెక్ విద్యార్థి డ్రగ్ పెడ్లర్‌గా మారాడు. ఈ క్రమంలో గంజాయి సేవిస్తుండగా అతడితో పాటు మరో ఐదుగురు విద్యార్థులను పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇబ్రహీంపట్నం టౌన్‌లో ఓ ప్రైవేటు హాస్టల్‌పై నార్కోటిక్ బృందం, ఇబ్రహీంపట్నం పోలీసులు గురువారం రాత్రి సంయుక్తంగా దాడులు చేసి 150 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి సరఫరాదారుడితో కలిపి ఏడుగురిపై కేసులు నమోదు చేశారు. ఇందులో గంజాయి సరఫరాదారుడు పరారీలో ఉన్నారు. సీఐ సత్యనారాయణ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ టౌన్‌కు చెందిన శ్రీరాముల సాత్విక్ (21) ఇబ్రహీంపట్నంలోని గురునానక్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతూ.. ఇక్కడ ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఉంటున్నాడు. కాగా, అతనికి సిరిసిల్ల సమీపంలోని ఇల్లంతకుంటకు చెందిన నవీన్(25)తో పరిచయం ఏర్పడింది. నవీన్ భద్రాచలం ఏజెన్సీ ఏరియా నుంచి గంజాయిని తీసుకొచ్చి సాత్విక్‌కు సరఫరా చేస్తున్నాడు. ఈ క్రమంలో గంజాయికి అలవాటుపడిన సాత్విక్ పెడ్లర్‌గా మారి ఇబ్రహీంపట్నం పరిసరాల్లో చదువుతున్న విద్యార్థులకు గంజాయి పాకెట్లను విక్రయిస్తున్నాడు. ఇదే క్రమంలో తాను చదువుతున్న కళాశాలలోనే బీటెక్ విద్యార్థులు నూకల సంపత్‌నాయుడు (20), స్వయంపాకుల కార్తీక్ (20), ఓ మైనర్‌లతోపాటు నగరంలోని ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని ఓ కళాశాలలో హోటల్ మేనేజ్‌మెంట్ చేస్తున్న పడాల వంశీ(20), దంపేట గణేష్ (21)లతో పరిచయం పెంచుకున్నాడు. నవీన్ మినహా పై ఆరుగురు ఇబ్రహీంపట్నంలోని ఓ హాస్టల్‌లో గంజాయి సేవిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు.. గురువారం రాత్రి 7 గంటల ప్రాంతంలో నార్కోటిక్ బృందం, స్థానిక పోలీసులు దాడులు నిర్వహించి అదుపులోకి తీసుకున్నారు. కాగా, సాత్విక్‌పై ఇదే విషయంలో మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో కూడా గతంలో ఓ కేసు నమోదైంది. నవీన్‌పై మీర్‌పేట్‌లో ఓ కేసు, సిరిసిల్లలో మూడు కేసులున్నాయి. ఈ మేరకు వీరిపై కేసులు నమోదు చేశామని, గంజాయి అమ్మకందారైన సాత్విక్‌ను రిమాండ్‌కు పంపినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. మరో నిందితుడు నవీన్ పరారీలో ఉన్నట్లు చెప్పారు.

డీఎస్సీ పరీక్షలు

ప్రశాంతం

- రెండోరోజు ఉదయం పరీక్షకు 3,482, మధ్యాహ్నం పరీక్షకు 6,870మంది హాజరు



రంగారెడ్డి అర్బన్, జూలై 19 : రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జిల్లా నియామక కమిటీ (డీఎస్సీ) రాత పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మొదటిసారిగా ఆన్‌లైన్ ద్వారా కంప్యూటర్ ఆధారిత విధానం (సీబీఆర్టీ)లో ఈ పరీక్షలను పాఠశాల విద్యాశాఖ నిర్వహిస్తుంది. ఈ పరీక్షలకు జిల్లాలో 8 సెంటర్లు ఏర్పాటు చేశారు. శుక్రవారం రెండో రోజు ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకు నిర్వహించిన పరీక్షకు 3,675 మంది హాజరు కావాల్సి ఉండగా 3,482మంది హాజరయ్యారు. 85 శాతం హాజరు నమోదైంది. 193 మంది హాజరు కాలేదు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు నిర్వహించిన పరీక్షకు 7,212 మంది హాజరు కావాల్సి ఉండగా 6,870 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 95 శాతం హాజరు నమోదైంది. 342మంది హాజరు కాలేదు.

గ్రీన్ బెల్టు ఉన్నట్టా...! లేనట్టా..?



చెరువుకట్ట కింద జాతీయ రహదారికి అనుకుని నిర్మిస్తున్న షెడ్

మేడ్చల్ టౌన్, జూలై 19: మేడ్చల్ పెద్ద చెరువు కట్టకు ఆనుకుని ఉన్న వ్యవసాయ పొలాలను గ్రీన్ బెల్టు కింద ప్రకటిస్తూ గత ప్రభుత్వాలు జారీ చేసిన జీవో కాగితాలకే పరిమితమైంది. చెరువు కింది స్థలాలు ఎల్లప్పుడు పచ్చగా ఉండటంతో పాటు చెరువు కట్ట ఉనికిని కాపాడాలన్న ఉద్దేశ్యంతో గత ప్రభుత్వాలు పెద్ద చెరువు కట్ట కింది వ్యవసాయ పొలాలను గ్రీన్‌బెల్టు జోన్ కింద ప్రకటిస్తూ జీవోను జారీ చేసింది. అప్పటి నుంచి చెరువుకట్ట కింది పొలాల్లో వ్యవసాయంతప్ప ఇతర నిర్మాణాలను నిషేధించారు. అయినప్పటికీ ఈ ప్రాంతంలో ఉన్న రైతుల వద్ద నుంచి కొందరు స్థలాలు కొని పెద్ద ఎత్తున నిర్మాణాలు చేపడుతున్నారు. మరికొందరు అద్దెకు స్థలం తీసుకుని తాత్కాలిక షెడ్‌లు ఏర్పాటు చేసుకుంటున్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు, ఇరిగేషన్ శాఖ అధికారులు పట్టించుకునే పాపాన పోవటంలేదు. గ్రీన్ బెల్టులో చేపట్టిన నిర్మాణాలతో చెరువు తూముల ద్వార నీరు పారే కాల్వలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈ విషయంలో ఇరిగేషన్ శాఖ అధికారులకు స్పష్టమైన సమాచారం ఉన్నప్పటికీ వారు పట్టించుకోవడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వందల ఎకరాలకు సాగు నీరు, వేల ఎకరాలకు భూగర్భ జలాలు అందించే పెద్దచెరువు ఉనికిని కాపాడాలన్న ఉద్దేశ్యంతో గత పాలకులు చెరువు కట్ట కింది స్థలాలను గ్రీన్‌బెల్టు జోన్ కిందకు కేటాయించినప్పటికీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా గ్రీన్‌బెల్టుకు తూట్లు పొడుస్తూ అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. గ్రీన్‌బెల్టు స్థలంలో ముందుగా మట్టినింపి చదును చేసుకుని తాత్కాలిక షెడ్‌లు వేసి అనంతరం పక్కా భవనాల నిర్మాణాలు చేపడుతున్నారు.

జాతీయ రహదారికి ఆనుకుని నిర్మాణాలు

గ్రీన్‌బెల్టు కింద కేటాయించిన వ్యవసాయ పొలాలు పెద్దచెరువు కట్ట నుంచి జాతీయ రహదారి వరకు ఉన్నాయి. దీంతో రహదారికి ఆనుకుని ఉన్న భూములకు పెద్దఎత్తున డిమాండ్ ఉండటంతో కొందరు గ్రీన్‌బెల్టు పరిధిలోని భూములు కొని వాటిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారు. మేడ్చల్ పట్టణం నుంచి చెక్‌పోస్టు వరకు దాదాపు రెండు కిలోమీటర్ల పొడవున జాతీయ రహదారికి ఆనుకుని గ్రీన్‌బెల్టు జోన్ ఉంది. ఈ గ్రీన్‌బెల్ట్‌లో నిర్మాణాలు చేపట్టదలచిన వారు ముందుగా జోన్ మార్పిడికి దరఖాస్తు చేసుకునే వీలును ప్రభుత్వం కల్పించింది. అనంతరం ఇరిగేషన్, హెచ్‌ఎండీఏ, రెవెన్యూ అధికారులు తగిన విచారణ జరిపి సమర్పించే నివేదిక ఆధారంగా నిర్మాణాలకు అనుమతులు జారీ చేస్తారు. ప్రధానంగా నిర్మాణాలకు దరఖాస్తు చేసుకునే ప్రాంతం కట్టకు కనీసం 100మీటర్లు దూరాన ఉండాలి. నిర్మాణాలతో చెరువు కట్టకు, కట్ట కింద కాలువకు, ఇతర వ్యవసాయ పొలాలకు ఇబ్బందులు కలగకుండా ఉండాలి. అనంతరం ప్రభుత్వం తగిన ఫీజులు వసూలు చేసి నిర్మాణం కోసం అనుమతి జారీచేస్తుంది. నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకుంటే లక్షల రూపాయలు ప్రభుత్వానికి ఫీజులు చెల్లించటంతో పాటు కాలయాపన జరుగుతుందన్న ఉద్దేశ్యంతో కొందరు కట్టకు వంద మీటర్ల లోపు నిర్మాణాలు చేపట్టేవారు. మరికొందరు దొంగచాటుగా నిర్మాణాలు చేపట్టి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. మూడుపువ్వులు ఆరుకాయల్లా కొనసాగుతున్న ఈనిర్మాణాలకు ఇరిగేషన్‌శాఖ అధికారుల అభయహస్తం ఉందన్న ఆరోపణలు పెద్దఎత్తున వినబడుతున్నాయి.



దర్శనం అనంతరం నాయకులతో భక్త చరణ్ దాస్ దంపతులు

చిలుకూరు బాలాజీ సేవలో కేంద్ర మాజీ మంత్రి

మొయినాబాద్ రూరల్, జూలై 19: కలియుగ దైవం చిలుకూరు బాలాజీని కాంగ్రెస్ జాతీయ సీనియర్ నాయకుడు, సీడబ్ల్యూసీ మెంబర్, కేంద్ర మాజీ మంత్రి భక్త చరణ్‌దాస్ దంపతులు దర్శించుకున్నారు. మండలం పరిధిలోని చిలుకూరు బాలాజీ దేవాలయానికి శుక్రవారం వచ్చిన ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ విశిష్టతను ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్ వారికి వివరించారు. ఆలయానికి సంబంధించిన చరిత్ర పుస్తకాన్ని అందజేశారు. వారి వెంట మండలాధ్యక్షుడు తమ్మలి మాణయ్య, సీనియర్ నాయకులు పురాణం వీరభద్రస్వామి, మర్రి రవీందర్‌రెడ్డి, శ్రీరాంనగర్ జంగారెడ్డి తదితరులు ఉన్నారు.



చేవెళ్ల : చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

చేవెళ్ల/షాబాద్, జూలై 19 : పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం లాంటిదని ఎమ్మెల్యే యాదయ్య తెలిపారు. శుక్రవారం చేవెళ్ల మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన 55 మంది లబ్దిదారులకు రూ.17లక్షల 99వేలు చెక్కులను అందించారు. ఆయన మాట్లాడుతూ ఆపదలో ఆసుపత్రిలో చేరిన వారికి సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సున్నపు వసంతం, సాత ప్రవీణ్‌కుమార్, షాబాద్ మండలాధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, నాయకులు మహేందర్‌గౌడ్, రాజశేఖర్, ఆంజనేయులు, మహేష్, అనంతరెడ్డి, రాజు, ఆయా గ్రామాల నాయకులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

భూ వివాదంలో ఇరువర్గాల ఘర్షణ



తహసీల్దార్ కార్యాలయంలో దాడి చేసుకుంటున్న ఇరువర్గాలు

మర్పల్లి, జూలై 19: భూ వివాద విషయంలో ఇరువర్గాలు కర్రలు, రాళ్లతో ఒకరిపై ఒకరు దాడి చేసుకోగా ఓవ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం మర్పల్లిలో చోటు చేసుకుంది. మండలంలోని సిరిపూరం వెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 461, 462లో ఉన్న ఇనాం భూముల విషయంలో అదే గ్రామానికి చెందిన బి.నర్సింహులు తన వర్గంతో, అదే గ్రామానికి చెందిన మాణిక్‌రావు (మల్లేశం), తుమ్మలపల్లి గ్రామానికి చెందిన దొడ్ల జయరాజ్‌తో కలిసి శుక్రవారం మర్పల్లి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. అక్కడున్న తహసీల్దార్‌తో మాట్లాడి ఆర్‌ఐ దగ్గరికి వెళ్లి ఇనాం భూమి విషయంపై అడుగగా ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగింది. టేబుల్‌పై ఉన్న కర్ర, పేపర్‌పై ఉంచిన రాయితో ఒకరిపై ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. అక్కడున్న కొంత మంది వారిని అడ్డుకున్నా వినిపించుకోలేదు. దీంతో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్‌ఐ సురేశ్ సంఘటనా స్థలానికి చేరుకోవడంతో అప్పటికే గొడవ సద్దుమణిగింది. ఈ సంఘటనలో సిరిపూరం గ్రామానికి చెందిన మాణిక్‌రావు తలకు తీవ్రగాయాలు కావడంతో ఆయనను మర్పల్లి ఆసుపత్రికి తరలించారు. మాణిక్‌రావు ఫిర్యాదు మేరకు మరో వర్గం వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేశ్ తెలిపారు. అధికారులు సమక్షంలోనే ఇరువర్గాలు దాడి చేసుకోవడంతో అక్కడున్న అధికారులతో పాటు వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన రైతులు, భూ విక్రయ, కొనుగోలుదారులు భయాందోళనకు గురయ్యారు. భూ తగాదాల్లో తరచూ తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఇలాంటి సంఘటనలు జరుగుతుండగా శుక్రవారం కార్యాలయంలో అధికారుల ముందే దాడి చేసుకున్న సంఘటనతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి



అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న పులిమామిడి గ్రామస్తులు

కందుకూరు, జూలై 19: మండలంలోని పులిమామిడి గ్రామంలో రూ.కోట్ల విలువచేసే 7ఎకరాల 13గుంటల ప్రభుత్వ భూమి, నక్షబాటను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని, ఆ భూమిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని గ్రామస్తులు శుక్రవారం అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ నేత అనేగౌని దామోదర్‌గౌడ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు వినతిపత్రం ఇచ్చిన అనంతరం మాట్లాడారు. పులిమామిడి రెవెన్యూ పరిధి సర్వేనెంబర్ 77లో రియల్‌ఎస్టేట్ వ్యాపారి పూర్ణచందర్‌రెడ్డి ఫామ్‌ల్యాండ్ పేరుతో 7ఎకరాల 13గుంటల ప్రభుత్వ భూమిని ఆక్రమించాడని ఆరోపించారు. ఎకరం ధర కోటికి పైనే ఉంటుందని, ప్రభుత్వ భూమితో పాటు పెద్ద తండావాసులు వ్యవసాయ భూములకు వెళ్లడానికి పూర్వం నుంచి ఉన్న నక్షబాటను సైతం కబ్జా చేశారన్నారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులకు విన్నపించడం జరిగిందని, అతనిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అదనపు కలెక్టర్, డీఆర్‌వో రాజులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. వెంటనే ప్రభుత్వ భూమిని సర్వేచేసి స్వాధీనం చేసుకొని, నక్షబాటను చూపించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామస్తులు బుక్క పాండు రంగారెడ్డి, సీహెచ్ రమేష్, టి.శేఖర్, పి. రవీందర్‌లు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఉన్న పాఠశాలను

పరిశీలించిన కడా ప్రత్యేకాధికారి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి


కొడంగల్ రూరల్, జూలై 19: మండలంలోని హస్నాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శిథిలావస్థలో ఉందని గ్రామస్థులు ఇటీవలే కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ ఆథారిటీ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి పాఠశాలను సందర్శించి మరమ్మతు చర్యలు తీసుకోవాలని తెలపడంతో శుక్రవారం కడా ప్రత్యేకాధికారి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రశాంత్‌తో కలిసి పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఉపాధ్యాయులతో అడిగి తెలుసుకున్నారు. ఈ విషయంపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మల్లేశ్ తదితరులు ఉన్నారు.

ఎంపీడీవో, ఎంపీవోల బదిలీ

బషీరాబాద్/తాండూరు రూరల్, జూలై 19: బషీరాబాద్ ఎంపీడీవో జె.రాఘవులు, ఎంపీవో రమేష్ బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఎంపీడీవో నాగర్‌కర్నూల్ జిల్లా, ఎంపీవో మిర్యాలగూడ, పీఆర్ ఏఈ వంశీకృష్ణ షాద్‌నగర్, పంచాయతీ కార్యదర్శులు వివిధ మండలాలకు బదిలీపై వెళ్లనున్నారు. ఒకటి ఒకటి, రెండు రోజుల్లో ఇక్కడి నుంచి వీరందరూ రిలీవ్ కానున్నారు. అదేవిధంగా తాండూరు మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న ఎంపీవో రతన్‌సింగ్ బదిలీపై పెద్దేముల్ ఎంపీవోగా వెళ్లారు. కొడంగల్ మండల ఎంపీవోగా పనిచేస్తున్న శ్రీనివాస్ తాండూరు మండలం ఎంపీవోగా బదిలీపై వచ్చారు. వీరితో పాటు ఆయా గ్రామాల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు కూడా బదిలీపై వెళ్లారు.

పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇచ్చే వరకూ పోరాటం

- సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగయ్య



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

చేవెళ్ల, జూలై 19 : పట్టణ కేంద్రంలో ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న పేదలకు ప్రభుత్వం వెంటనే పట్టాలు ఇవ్వాలని, అప్పటి వరకూ పోరాటం చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమకుల జంగయ్య డిమాండ్ చేశారు. గతేడాది చేవెళ్లలో సీపీఐ ఆధ్వర్యంలో చేవెళ్లలోని ప్రభుత్వ భూమి సర్వేనెంబర్ 75లో పేదలు గుడిసెలు వేయడంతో.. అప్పట్లలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలమకుల జంగయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు రామస్వామి, పానుగంటి పర్వతాలు, చేవెళ్ల మండల కార్యదర్శి సత్తిరెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణచారి, నాయకులు సుధాకర్‌గౌడ్, శ్రీనివాస్, నరేష్, కృష్ణగౌడ్, వినోద్, తదితరులపై చేవెళ్ల పోలీస్‌లు కేసు నమోదు చేశారు. ఈమేరకు కేసు విచారణ శుక్రవారం చేవెళ్ల కోర్టులో జరిగింది. రాష్ట్ర నాయకులు తప్ప.. జిల్లా నాయకులందరూ కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భగా జంగయ్య మాట్లాడుతూ పేదల గూడు కోసం గుడిసెలు వేస్తే.. అప్పటి ప్రభుత్వం, పోలీస్‌లు తమ నాయకులపై కేసులు నమోదు చేశారని గుర్తుచేశారు. కేసులకు భయపడేది లేదన్నారు. సీపీఐ నాయకులు తదితరులు ఉన్నారు.



ర్యాలీలో పాల్గొన్న వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులు

'నిఖిల్‌చేతన్'లో

ఘనంగా గురుపౌర్ణమి

- వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులతో ర్యాలీ

కందుకూరు, జూలై 19 : మండల పరిధిలోని పులిమామిడి గ్రామంలో గల నిఖిల్‌చేతన్ ఆశ్రమంలో ఈనెల 21న గురుపౌర్ణమిని పురస్కరించుకొని వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేశారు. ఈమేరకు శుక్రవారం తెలుగు రాష్ట్రాలతో పాటు ఉత్తరప్రదేశ్, ఛత్తీష్‌గఢ్, రాజస్థాన్, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆశ్రమం గురూజీ అనిల్‌కుమార్ జోషి మండల కేంద్రం నుంచి పులిమామిడిలోని ఆశ్రమం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. భజన, భక్తి పాటలు, నృత్యాలతో ర్యాలీ సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7గంటల వరకు కొనసాగింది. దాదాపు రెండు వేలకు పైగా భక్తులు పాల్గొన్నారు. శనివారం, ఆదివారం ఆశ్రమంలో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఎరువుల కృత్రిమ కొరత సృష్టించొద్దు

ఆమనగల్లు, జూలై 19: ఎరువుల, పురుగు మందుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని మండలవ్యవసాయ శాఖ అధికారి అరుణకుమారి హెచ్చరించారు. ఎరువుల డీలర్లు ప్రభుత్వ నిబంధనలకు లోబడి నడుచుకోవాలని సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని ఎరువుల, విత్తన దుకాణాలను శుక్రవారం అరుణ కుమారి తనిఖీ చేశారు. రికార్డులను, స్టాక్‌ను పరిశీలించారు. అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. డీలర్లు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల సందర్శన



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి

కీసర, జూలై 19: మేడ్చల్ జిల్లా విద్యాధికారి విజయకుమారి కీసర మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను శుక్రవారం సందర్శించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని యాద్గార్‌పల్లి, రాంపల్లి దాయరలోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థుల చేరికలపై ఆమె ఆరాతీశారు. అదే విధంగా విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం, వసతులు, తాగునీటి సరఫరా, ఉపాధ్యాయుల హాజరు వంటి వివరాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధికారుల ఆదేశాల మేరకు ప్రతీ మంగళ, శుక్రవారం ప్రభుత్వ పాఠశాలను సందర్శించినట్లు తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదని ఆమె ఉపాధ్యాయులకు హెచ్చరించారు.

బురదలో ఇరుక్కున్న బస్సు



దాదాపూర్ గేటు సమీపంలో బురదలో ఇరుక్కున్న బస్సు

దోమ, జూలై 19: మండలంలోని దాదాపూర్ గేటు కల్వర్టు దగ్గర ఆర్టీసీ బస్సు బురదలో ఇరుక్కుపోయింది. పరిగి డిపోకు చెందిన బస్సు శుక్రవారం దోమ, దాదాపూర్ మీదుగా కోస్గికి వెళ్తోంది. ఈ క్రమంలో రోడ్డుపై గుంతలు ఏర్పడి బురదమయంగా మారడంతో బస్సు ఇరుక్కుపోయింది. దీంతో అరగంటసేపు రాకపోకలకు అంతరాయం కలిగింది. ఈ రోడ్డును బాగు చేయాలని గ్రామస్థులు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపో యారు. ఇప్పటికైనా రోడ్డు మరమ్మతు చేయాలని కోరారు.

రైల్వే అండర్‌పాస్‌లో ట్రాక్టర్..



రైల్వే అండర్ పాస్ వద్ద ఇరుక్కున్న ట్రాక్టర్

మేడ్చల్ టౌన్, జూలై 19: మేడ్చల్ రైల్వే స్టేషన్ సమీపంలో గల రైల్వే అండర్ పాస్‌లో శుక్రవారం ట్రాక్టర్ ఇరుక్కోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. చిన్నపాటి వాహనాలు వెళ్లడానికి వీలున్న రైల్వే అండర్ పాస్ నుంచి ఇటుకలు తరలించే ట్రాక్టర్ వెళ్లే ప్రయత్నంలో ఇరుక్కుంది. ఫలితంగా రెండు గంటల పాటు అండర్ పాస్ వంతెనకు ఇరువైపులా వాహనాలు ఎక్కడిక్కడే నిలిచిపోయాయి. రైల్వేట్రాక్ దాటడానికి స్థానికులు ఈ అండర్ పాస్‌ను ఉపయోగిస్తున్నారు. కాగా అండర్‌పాస్ వంతెన నుంచి బైక్‌లు, ఆటోలు మాత్రమే దాటే వీలుంది. కాగా స్థానికులు ఇరుక్కున ట్రాక్టర్‌ను స్థానికుల సాయంతో బయటికి లాగి రాకపోకలను కొనసాగించారు.

అటవీ భూములను ఆక్రమిస్తే చర్యలు



అటవీ భూములను పరిశీలిస్తున్న అధికారులు

కులకచర్ల, జూలై 19: ప్రభుత్వ అటవీ భూములను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని అనంతసాగర్ ఫారెస్టు సెక్షన్ అధికారి సాయికుమార్ తెలిపారు. గ్రామ సమీపంలోని చిన్న రామయ్యతండా ప్రాంతంలోని రిజర్వు ఫారెస్టు భూముల్లో శుక్రవారం మొక్కలు నాటేందుకు పరిశీలిస్తుండగా రైతులు అక్కడికి వచ్చి అడ్డుకునే ప్రయత్నం చేశారు. అట్టి భూములు తాము సాగు కోసం సిద్ధం చేసుకున్నామని తమకు పట్టాలు ఇప్పించాలని కోరారు. ప్రభుత్వ అటవీ భూములు అని, ఎవరైనా ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని రైతులకు తెలిపారు. మొక్కలు నాటడాన్ని అడ్డుకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మందిపాల్ ఫారెస్టు సెక్షన్ అధికారి ప్రవీణ్‌కుమార్, ఫారెస్టు, పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం



కొడంగల్: సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న గురునాథ్‌రెడ్డి, తదితరులు



మూడుచింతలపల్లి: లక్ష్మాపూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

కొడంగల్, జూలై 19: రైతు శ్రేయస్సు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని తెలంగాణ రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఆర్.గురునాథ్‌రెడ్డి అన్నారు. రుణమాఫీ సంబురాల్లో భాగంగా శుక్రవారం స్థానిక పెట్రోల్ బంక్ నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలతో ర్యాలీగా అంబేడ్కర్ చౌరస్తాకు చేరుకొని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్‌గుప్త, కాంగ్రెస్ నాయకులు భాస్కర్, నయీమ్, శ్రీకాంత్, సయ్యద్ అంజద్, టి.సాయిలు, కాశప్ప, పకీరప్ప, శంకర్‌నాయక్, మునీర్, యాదిరెడ్డి, ఆసిఫ్‌ఖాన్, ఎస్ఎం.గౌసన్ పాల్గొన్నారు. అదేవిధంగా బీసీ సంఘం తాలూకా అధ్యక్షుడు మన్నె బస్వరాజ్‌యాదవ్ మాట్లాడుతూ. రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రూపాయల రైతు రుణమాఫీ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ చరిత్రాత్మక నిర్ణయమని అన్నారు.

కొడంగల్ రూరల్: కొడంగల్ మండల పరిధిలోని ఉడిమేశ్వరంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, నరేందర్‌ల ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

దోమ: బొంపల్లి గ్రామంలో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు రుణమాఫీ సంబురాల్లో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కోళ్ల సురేశ్, గందె రాములు, అంతిరెడ్డి, నర్సింహారెడ్డి, బాబు, శేఖర్, రాము, బషీర్, కలీం, ఇంతియాజ్, భాస్కర్ పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: బొట్లవనితండా గ్రామ పంచాయతీలో రైతు రుణమాఫీ సంబరాల్లో భాగంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఏకకాలంలో రైతు రుణమాఫీ చేయడం హర్షించదగ్గ విషయం అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతుల పక్షపాతి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దేశ్యానాయక్, మోతిబాయి, మెగ్యానాయక్, పిన్యా, కాలునాయక్, రాథోడ్, నాని, బాలు పాల్గొన్నారు.

పరిగి: సీఎం రేవంత్‌రెడ్డి ఏకకాలంలో రూ.2లక్షల వరకు రుణమాఫీ చరిత్రాత్మక నిర్ణయమని కాంగ్రెస్ పార్టీ మండల ప్రధానకార్యదర్శి ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని రాఘవాపూర్ గ్రామంలోని హనుమాన్ టెంపుల్ దగ్గర కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి చిత్రపటాలకు శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బి.రాములు, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

మూడుచింతలపల్లి: దేశ చరిత్రలోనే రైతు రుణమాఫీ చరిత్రాత్మక నిర్ణయమని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బండి జగన్నాథమ్ అన్నారు. మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ విలేజ్ ప్రెసిడెంట్ గోపి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరేశం, నర్సింహులు, మల్లేశం, సంతోష్, అశోక్, లక్ష్మణ్, మురళి, రైతులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి



మేడ్చల్ టౌన్: టైర్లలో నిలువ ఉన్న నీటిని తొలగింపజేస్తున్న కమిషనర్ నాగిరెడ్డి



కీసర రూరల్: కాలనీ వాసులకు మొక్కలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీత

మేడ్చల్ టౌన్, జూలై 19: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి కోరారు. ఫ్రైడే.. డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన మున్సిపల్ పరిధిలోని పలు వార్డులను పర్యటించి పరిసరాలను శుభ్రం చేయించారు. పలు హోటళ్ల పరిసరాలను, టైర్ల దుకాణాలను పర్యటించి టైర్లలో నిలువ ఉండే నీళ్లను తొలగించారు. ఈ కార్యక్రమంలో సానిటేషన్ ఇన్స్‌పెక్టర్ రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని నారపల్లి ప్రభుత్వ పాఠశాలను శుక్రవారం పరిశీలించి పరిసరాలో చెత్తాచెదారాన్ని తొలగించి బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వేమనరెడ్డి, కౌన్సిలర్లుల సుధాలక్ష్మి, పోచమ్మ, కోఆప్షన్ సభ్యుడు అక్రం అలీ, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

కీసర రూరల్: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని దమ్మాయిగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ వసుపతి ప్రణీత అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధి రాజీవ్ గృహ కల్ప కాలనీలో ఫ్రైడే-డ్రైడే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్య, కౌన్సిలర్ నానునాయక్, సానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రభు, బస్తీ దవాఖానా వైద్యురాలు అలేఖ్య, ఏఎన్ఎం విజయరాణి, తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతీఒక్కరు కృషి చేయాలని ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ అన్నారు. ఘట్‌కేసర్ డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక జడ్పీబాలుర హైస్కూల్‌లో విద్యార్థులతో కలిసి పరిసరాలను శుభ్రం చేసి అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పాపిరెడ్డి పాల్గొన్నారు.



ఘట్‌కేసర్: మాట్లాడుతున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

ఎల్మకన్నె పరిధిలో 106 మంది రైతులకు రుణమాఫీ

తాండూరు రూరల్, జూలై 19: ఎల్మకన్నె ప్రాథమిక సహకార సంఘం పరిధిలో 106 మంది రైతులకు మాత్రమే లక్ష లోపు రుణమాఫీ అయిందని సీఈవో శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఎల్మకన్నె సంఘం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలోని ఎల్మకన్నె సహకార సంఘంలో ఆయా గ్రామాలకు చెందిన మొత్తం 514 మంది రైతులు రుణాలు తీసుకున్నారన్నారు. ఇందులో 270 మంది రైతులు రూ.లక్ష లోపు రుణం తీసుకున్న వారు ఉండగా, 244 మంది రైతులు రూ.2లక్షల వరకు రుణాలు పొందిన వారు ఉన్నారన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన రైతు రుణమాఫీలో సహకార సంఘం పరిధిలో 106మంది రైతులకు మాత్రమే గాను ప్రభుత్వం రూ.62లక్షల 73వేలు వారి ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. ఇంక 164మంది రైతులకు రుణమాఫీ రాలేదన్నారు. డిసెంబర్ 2018 నుంచి డిసెంబర్ 2023 వరకు రుణాలు పొందిన రైతులకు మాత్రమే రుణమాఫీ వర్తిస్తోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఆర్థిక సాయం

పరిగి, జూలై 19: పేదల వైద్య చికిత్సల కోసం ఆర్థిక సాయం అందించడం అభినందనీయమని మునిసిపల్ 11వ వార్డు కౌన్సిలర్ ఎదిరె కృష్ణ అన్నారు. మునిసిపల్ పరిధిలోని 11వ వార్డులో అనారోగ్యంతో బాధపడుతున్న బాలరాజ్‌గౌడ్‌కు చికిత్సల నిమిత్తం నగరానికి చెందిన సల్మాన్‌ఖాన్ యూత్ కరేజీ వారు ఇచ్చిన రూ.లక్షన్నర నగదును బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో మన్నెగూడ మాజీ ఎంపీటీసీ అదిల్, నాయకులు సోయబ్, నరేష్ ఉన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



నజీం(ఫైల్)

పరిగి/బొంరాస్‌పేట్, జూలై 19: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన పరిగి మండలం గడిసింగపూర్ సమీపంలో చోటుచేసుకుంది. బొంరాస్‌పేట్ గ్రామానికి చెందిన నజీమ్(28)తో పాటు స్నేహితులు శంకర్, బుగ్గయ్య, అశోక్‌లు కలిసి నలుగురు స్నేహితులురెండు బైక్‌లపై పరిగిలోని ఓ విందుకు వస్తున్నారు. ఈ క్రమంలో పరిగి మండలం గడిసింగాపూర్ సమీపంలో ఒకే వైపు వెళ్తున్న రెండు బైక్‌లు అదుపుతప్పి కిందపడ్డారు. అతివేగంగా వెనుక నుంచి వస్తున్న టవేరా వాహనం నజీమ్‌పై నుంచి వెళ్లగా తలకు తీవ్రగాయాలయ్యాయి. నజీమ్‌ను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మృతిచెందాడు. స్నేహితులు శంకర్, బుగ్గయ్య, సీతారాం, అశోక్‌లకు స్వల్పగాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఈ ఘటనలో ప్రమాదానికి కారణమైన టవేరా వాహనం డ్రైవర్ పారారయ్యాడు. పరిగి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ ఒకరు..

ఘట్‌కేసర్ రూరల్, జూలై 19: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన పోచారం ఐటీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మధ్యప్రదేశ్‌లోని బటోడియా ఖుర్ద్, గుజర్‌ఘాట్‌కు చెందిన ఉదేష్‌రాజ్ భోసం(29) పోచారం మునిసిపల్, నారపల్లి సమీపంలో నివాసముటూ కూలీపనులు చేస్తున్నాడు. ఈ నెల 18న సాయంత్రం పని ముగించుకొని జోడిమెట్ల చౌరస్తా వద్ద రోడ్డు దాటుతుండగా బీబీనగర్ నుంచి ఉప్పల్ వైపు వెళ్తుతున్న మహేంద్ర తార్ కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన ఉదేష్‌రాజ్‌ను స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నగరంలోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఉదేష్‌రాజ్ భోసం చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఉదేష్‌రాజ్ మృతికి కారణమైన కారు డ్రైవర్ యాదాద్రీ-భువనగిరి జిల్లా, బీబీనగర్, వెంకట్‌రెడ్డి కాలనీకి చెందిన కాసుల తరుణ్‌గౌడ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కారు అతివేగంగా నడపడం వల్లే ప్రమాదం జరిగిందని పోలీసులు భావిస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విద్యుత్ కంచెకు తగిలి వ్యక్తి..

పెద్దేముల్, జూలై 19: వ్యవసాయ పొలానికి చుట్టూ వేసిన విద్యుత్ కంచెకు తగిలి కరెంటు షాక్‌తో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన బండమీదిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బండమీదిపల్లి గ్రామానికి చెందిన మదిరెరాజు తన వ్యవసాయ పొలంలో చెరుకుపంట సాగుచేస్తున్నాడు. పంటకు అడవి పందుల బెడద ఉందని, వాటిని నివారించేందుకు పొలం చుట్టూ విద్యుత్ కంచె ఏర్పాటుచేశాడు. అదే గ్రామానికి చెందిన ఓర్సు ఏలేష్(40) గురువారం కూలీ పనికి వెళ్లి మదిరెరాజు పొలంలో ఉన్న డ్రమ్ము తీసుకురావడానికి పొలంలోకి వెళ్లాడు. విద్యుత్‌కంచె తగిలి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. మదిరెరాజు, చింతల రాములు గమనించి వెంటనే కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చి అతడిని చికిత్స నిమిత్తం తాండూరు జిల్లా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. శుక్రవారం మృతుడి సోదరుడు వడ్డె హన్మంతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గిరి తెలిపారు.

మహిళ ఆత్మహత్య

వికారాబాద్, జూలై 19: అనారోగ్యంతో బాధపడుతూ ఓమహిళ ఆత్మహత్య చేసుకుంది. వికారాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. సీఐ నాగరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మర్పల్లి మండలం సిరిపురం గ్రామానికి చెందిన వీణ(35)ను 11 సంవత్సరాల క్రితం వికారాబాద్ మండలం పెండ్లిమడుగు గ్రామానికి చెందిన పట్లోళ్ల శివకుమార్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. వారికి కుమార్తె గ్లోకా ఉండగా ప్రస్తుతం వారు వికారాబాద్‌లోని బీటీఎస్ కాలనీలో నివాసముంటున్నారు. శివకుమార్ ప్రైవేటు ఉద్యోగం చేస్తుండగా వీణ గృహిణిగా ఉంటోంది. గురువారం రాత్రి భోజనం చేసి నిద్రిస్తున్న వారు తెల్లవారుజామున శివకుమార్ లేచి చూసేసరికి వీణ కనిపించలేదు. ఇంట్లో వెతకగా పక్కగదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించింది. తలుపులు పగులగొట్టి చూసేసరికి వీణ మృతిచెంది ఉంది. వెంటనే మృతురాలి తల్లి సుగుణమ్మకు సమాచారం అందించింది. అనారోగ్య కారణంగానే ఆత్మహత్య చేసుకుందని, తన కూతురు మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని సుగుణమ్మ ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గుట్కా ప్యాకెట్లు స్వాధీనం

పెద్దేముల్, జూలై 19: నిషేధిత గుట్కాలను అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకుని కేసునమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గాజీపూర్ గ్రామానికి చెందిన ఎండీ.సలాంపాషా కర్ణాటకలోని కుంచారం గ్రామం నుంచి ఆటోలో గుట్కాప్యాకెట్లు తరలిస్తున్నాడు. ఆత్కూర్ గ్రామ శివారులో ఆటోను తనిఖీచేయగా అందులో గుట్కాపాకెట్లు లభించాయి. వాటిని స్వాధీనం చేసుకుని ఎండీ.సలాంపాషాపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ గిరి తెలిపారు.


అవుటర్‌పై బొలేరో బోల్తా.. ఇద్దరికి గాయాలు



అవుటర్‌పై బోల్తాపడిన బొలేరో వాహనం

కీసర రూరల్, జూలై 19: మిక్చర్(తినుబండారం) లోడ్‌తో వెళ్తున్న బోలేరో వాహనం బోల్తా కొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. కీసర పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మేడ్చల్ నుంచి నగరంలోని దిల్‌సుఖ్‌నగర్‌కు మిక్చర్‌ను బోలేరో వాహనంలో అవుటర్ రింగ్‌రోడ్డు పైనుంచి తరలిస్తున్నారు. ఈ క్రమంలో ఆ వాహనం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోకి చేరుకుంది. మితిమీరిన వేగం, దీనికి తోడు పరిమితికి మించిన బరువు ఉండటంతో వాహనం అదుపుతిప్పి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్‌తో పాటు మరొకరికి గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో చేపలు పట్టడానికి వెళ్లి యువకుడు గల్లంతు



చెరువు వద్ద కొనసాగుతున్న గాలింపు చర్యలు

మేడ్చల్ టౌన్, జూలై 19: చెరువులో చేపలు పట్టడానికి వెళ్లిన ఓ యువకుడు గల్లంతయ్యాడు. ఈ ఘటన మేడ్చల్ పోలీస్టేషన్ పరిధిలోని పూడూరులో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఎర్రోళ్ల సంతోష్(29), మేకల సురేష్ అనే ఇద్దరు యువకులు గ్రామ సమీపంలోని చెరువులో చేపలు పట్టడానికి వెళ్లారు. కాగా చెరువులో దిగిన సంతోష్ నీటిలో గల్లంతయ్యాడు. ఈ విషయమై మేకల సురేష్ గ్రామస్తులకు, పోలీసులకు సమాచారం అందించాడు. అనంతరం సంతోష్ కోసం చెరువులో గాలింపు చేపట్టారు. శుక్రవారం సాయంత్రం చీకటి పడేంత వరకు చెరువులో గాలింపు చేపట్టిన ప్రయోజనం లేకపోవడంతో శనివారం ఉదయం తిరిగి గాలింపు చర్యలు చేపడతామని పోలీసులు తెలిపారు.

ఆనంద్‌నగర్ కాలనీపై ఎంపీవో విచారణ

కీసర, జూలై 19: కీసర ఆనంద్‌నగర్ కాలనీ సర్వే నంబర్ 368 నుంచి 395లో గల ప్లాట్ బాధితులు 1982 నుంచి 1990 వరకు ప్లాట్లు కొనుగోలు చేస్తే ఆ ప్లాట్ల ఆనవాళ్లు లేకుండా చేశారని ఇటీవల సీఎంవో కార్యాలయంలో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం ఎంపీవో నందకిషోర్ స్థల పరిశీలన చేసి విచారణ జరిపారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కీసర పంచాయతీ కార్యదర్శి గంగన్న పాల్గొన్నారు.

దివ్యాంగుడికి చార్జింగ్ ట్రైసైకిల్ అందజేత

బొంరాస్‌పేట్, జూలై 19: మండలంలోని లగచర్ల గ్రామానికి చెందిన మున్నూర్ నర్సింహులుకు సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో చార్జింగ్ ట్రై సైకిల్‌ను అందజేశారు. కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి దివ్యాంగుడు నర్సింహులుకు శుక్రవారం చార్జింగ్ బైక్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అవుటి శేఖర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

వైభవంగా వీరభద్రస్వామి ప్రాణప్రతిష్ఠాపన

మోమిన్‌పేట్, జూలై 19: మండలంలోని దేవరాపల్లి గ్రామ శివారులో గల ఆలవేలు మంగమ్మ శివపార్వతులు, వీరభద్రస్వామి ప్రాణప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆదిశంకరచార్యులు పీఠాధిపతి తునిస్వామి చేతుల మీదుగా ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతీ ఒక్కరు భక్తిభావం కలిగి ఉంటూ భగవంతుడి కృపకు పాత్రులు కావాలని సూచించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మున్సిపల్ కమిషనర్‌పై ఎమ్మెల్యేకు ఫిర్యాదు

తాండూరు, జూలై 19: తాండూరు మున్సిపల్ కమిషనర్ విక్రం సింహారెడ్డిపై జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీ కృష్ణ గౌడ్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. అప్రూవల్ లేవుట్ ఉన్నప్పటికీ ఇంటి నిర్మాణానికి సంబంధించి అన్ని రకాల డాక్యుమెంట్లు సరిగ్గా ఉన్నాయని చూపించినప్పటికీ కమిషనర్ పలుమార్లు సిబ్బందిని పంపించి తన సోదరుడిని ఇంటి నిర్మాణాన్ని ఆపి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఎమ్మెల్యేకు ఆయన వివరించారు. ఇందుకు సంబంధించి లిఖిత పూర్వకంగా ఎవరు ఫిర్యాదు చేశారో వివరాలివ్వాలని కోరితే కమిషనర్ దాటవేసే సమాధానాలు ఇస్తున్నారని ఎమ్మెల్యేకు చెప్పారు. ఇది ప్రభుత్వ భూమి అని కొందరు, వివాదస్పద స్థలం ఉందని మరికొందరు తన నోటీస్‌కు తెస్తున్నారని కమిషనర్ మురళీకృష్ణ గౌడ్‌కు వివరించే ప్రయత్నం చేసినట్లు తెలిపారు. తనకు తానుగా ఈ నిర్మాణంపై ఆసక్తి లేన్నప్పటికీ మీరు టీపీవోతో మాట్లాడి సెటిల్‌మెంట్ చేసుకోవాలని కమిషనర్ సూచించడం పలు అనుమానాలకు తావిస్తోందని మురళీకృష్ణగౌడ్ ఆరోపిస్తున్నారు. కమిషనర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇదిలా ఉండగా, గతంలో ఎమ్మెల్యే సమక్షంలో క్యాంపు కార్యాలయం వద్ద మల్‌రెడ్డిపల్లికి చెందిన సుభాన్‌రెడ్డి కమిషనర్‌ను మీరు పని చేయడం లేదని ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, అధికారపార్టీ నాయకులైన తమను ఇబ్బందులకు గురిచేస్తే ఎలా అని నిలదీసిన విషయం తెలిసిందే. మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్ కూడ కమిషనర్‌పై ఎమ్మెల్యేకు ఒంటెద్దుపోకడలు పోతున్నారని ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని కమిషనర్‌పై ఎమ్మెల్యే ఫిర్యాదు చేశారు. అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు చాలా మంది కమిషనర్‌పై తరుచూ ఫిర్యాదులు చేయడం చర్చనీయాంశమైంది.

నాణ్యమైన భోజనాన్ని అందించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

కీసర రూరల్, జూలై 19: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందజేయాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. మున్సిపల్ పరిధి నాగారంలోని ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకోవటంతో పాటు స్వయంగా భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన వారికి ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్, జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం రాములు, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం వెంకటేశం పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

● **కులకచర్ల:** కాలుష్య నివారణకు ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. వనమహోత్సవంలో భాగంగా పీరంపల్లి కమ్యూనిటి ప్లాంటేషన్‌లో శుక్రవారం ఆయన మొక్కలు నాటారు. కురుస్తున్న వర్షాలకు ప్రతీ గ్రామంలో వంద శాతం మొక్కలు నాటాలని తెలిపారు. ప్రభుత్వ స్థలాల్లో, రోడ్డుకు ఇరువైపులా, చెరువు కట్టలపై మొక్కలు నాటి సంరక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో చంద్రశేఖర్, కార్యదర్శి సంజీవ్‌కుమార్, టీఏ నరేశ్, ఎఫ్ఏ వెంకటయ్య, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

● **పెద్దేముల్:** రుక్మాపూర్ పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్ళిన ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, వసంత, పుష్పలతలను మాజీ సర్పంచ్ రమేష్, తాజామాజీ సర్పంచ్ శివలీల శాలువాలు కప్పి పూలదండలతో సన్మానించారు. ఈకార్యక్రమంలో అమ్మఆదర్శ పాఠశాల చైర్మన్ సుజాత, మాజీ చైర్మన్ పెద్దకుర్వ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

● **తాండూరు:** లారీ పార్కింగ్‌లో ఉచితంగా షెట్టర్స్‌ను నిర్మించేందుకు కృషిచేయాలని చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డికి తాండూరు ఓనర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. తాండూరులో శుక్రవారం నిర్వహించిన పౌర సన్మానం కార్యక్రమానికి హాజరైన ఎంపీని ఈ ప్రతినిధుల బృందం కలిసి వినతిపత్రాన్ని అందజేసింది. పట్టణ శివారులో అంతారం గ్రామం వద్ద 12 ఎకరాల స్థలం లారీ పార్కింగ్‌కు కేటాయించారని ఈ స్థలం అభివృద్ధికి కోసం టీఎస్ ఐఐసీకి అప్పగించారని కోరారు.

● **తాండూరు:** పట్టణంలోని మున్సిపల్ కౌన్సిలర్ సంగీత ఠాకూర్ నివాసంలో శుక్రవారం ఆషాడ మాస గోరింటాకు నిర్వహించారు. మహిళలు చేతులకు గోరింటాకు వేసుకుని సంప్రదాయాన్ని చాటారు. అనంతరం కౌన్సిలర్ సంగీత ఠాకూర్ మహిళలకు పసుపు, కుంకుమలను అందజేశారు.

● **దోమ:** సౌదీ అరేబియా యూనివర్సిటీ ప్రొఫెసర్ హైదరాబాద్ వాసి డాక్టర్ శ్రీదేవి, సురేశ్ దంపతులు దోమ మండలంలోని బుద్లాపూర్, బ్రహ్మణపల్లి పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం నోటు బుక్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు వారిని సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కిష్టాపూర్ కాంప్లెక్స్ హెచ్ఎం లాల్యానాయక్, జేఏసీ నాయకులు ముకుందనాగేశ్వర్, రాములు, హెచ్ఎం వెంకట్‌రెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

● **కులకచర్ల:** కులకచర్లలో దోమల నివారణకు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రత్యేకాధికారి, తహసీల్దార్ మురళీధర్ చొరవతో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం గ్రామంలోని వీధుల్లో ఫాగింగ్ చేయించారు.

● **దౌల్తాబాద్:** ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు రుణమాఫీలో భాగంగా రుణమాఫీ కాని కొంత మంది రైతులకు తాము రుణమాఫీ చేయిస్తామని నమ్మించి దళారులు అందినకాడికి దోచుకుంటున్నట్లు అక్కడక్కడ వినిపిస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బోడివెంకట్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

● **ఘట్‌కేసర్ రూరల్:** రాష్ట్ర వడ్డెర సంఘం అధ్యక్షుడు శివరాత్రి అయిలమల్లును ఎంఈవో కార్యాలయం వద్ద శుక్రవారం మండల వడ్డెర సంఘం నాయకులు కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మండలంలో వడ్డెరులు ఎదుర్కోంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. ఈ కార్యక్రమంలో వరికుప్పల నర్సింహా, వరికుప్పల మహేశ్వరి, జగదీష్, వేముల బాబు, పల్లపు లింగం పాల్గొన్నారు.

● **మేడ్చల్ టౌన్:** ప్రతి ఒక్కరు తమ ఇంట్లో ఒక మొక్క నాటి దానిని సంరక్షించాలని మేడ్చల్ మున్సిపల్ 13వ, వార్డు కౌన్సిలర్ మర్రి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం శ్రీనివాస్ రెడ్డి తన వార్డులో ఇంటింటికి మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు.

● **మేడ్చల్ టౌన్:** రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ ద్వారా మద్యం కొనుగోలు ధరలను ఖరారు చేయడానికి ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీలో మేడ్చల్ మున్సిపల్ కిష్టాపూర్‌కు చెందిన సీనియర్ చార్టెండ్ అకౌంటెంట్ నవీన్ రెడ్డికి అవకాశం దక్కింది. ప్రభుత్వం మద్యం ధరల ఖరారు కోసం రిటైర్డ్ హైకోర్టు జడ్జీ, ఐఏఎస్ అధికారితో పాటు చార్టెండ్ అకౌంటెంట్‌ను కలుపుతూ త్రిసభ్య కమిటీని నియమించింది. అందులో నవీన్ రెడ్డికి అవకాశం లభించింది.

● **ధారూరు:** ధారూరులోని బీసీకాలనీలో శుక్రవారం సాయంత్రం బోర్‌డ్రిల్లింగ్ చేశారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్ బోర్ డ్రిల్లింగ్ నిమిత్తం నిధులు మంజూరు చేయించినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.